క్లుప్తంగా

నేటి నుంచి మంచినీటి సరఫరా



పేరంటాలమ్మ పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్ : నాలుగు రోజులుగా డోన్ పట్టణంలో ఏర్పడిన మంచినీటి సమస్య పరిష్కరించేందుకు సిబ్బంది రేయింబవళ్లు కష్టపడుతున్నారని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. ఆదివారం స్థానిక పేరంటాలమ్మ గుడి వద్ద ఉన్న పంప్‌హౌస్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటకొండ, ఆగవేలి ప్రాంతాల్లో లీకేజీలు, మోటార్లు కాలిపోవడంతో మంచినీటి సమస్య ఏర్పడిందన్నారు. డీఈ రసూల్ ఆధ్వర్యంలో ఏఈ సురేష్, సిబ్బంది మరమ్మతులు పూర్తి చేశారన్నారు. సోమవారం నుంచి మంచినీటి సరఫరా చేస్తామని తెలిపారు.

పౌష్టికాహారం పంపిణీ



ఆసుపత్రిలో రొట్టె, గుడ్డు, పప్పు పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్ : ప్రార్థన సమయం సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో ప్రతి ఆదివారం చేపట్టే పౌష్టికాహారం పంపిణీ కొనసాగింది. సంస్థ సభ్యులు గర్భిణులు, బాలింతలు, రోగులకు రొట్టె, పప్పు, గుడ్డు అందజేశారు. రాధాక్రిష్ణ స్వీట్ స్టాల్ ఆర్థిక సాయంతో పౌష్టికాహారం పంపిణీ చేశామని ఆ సంస్థ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ తెలిపారు.

నేత్ర దానం



నేత్రాలు అందజేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేట కాలనీకి చెందిన రాములమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. శంకరయ్య, రంగస్వామి తమ తల్లి నేత్రాలను దానం చేస్తామని లైఫ్ యువనేత్ర సమితి సభ్యులకు తెలిపారు. ఈ మేరకు నంద్యాలలోని ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంక్ ప్రతినిధులు, నేత్ర సేకరణ నిపుణులు శ్రీకాంత్ మృతురాలి నేత్రాలను సేకరించి కుటుంబ సభ్యుల చేతుల మీదుగా తీసుకున్నారు. కార్యక్రమంలో లైఫ్ యువ నేత్ర సభ్యులు అక్బర్, శ్రీనివాసులు, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

హిందూ ధర్మరక్షా నిధికి సహకారం అందించాలి



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె : హిందూ ధర్మరక్షా నిధికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే స్వగృహంలో హిందూ ధర్మరక్షా నిధి కోసం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తమవంతుగా రూ.15వేల విరాళాన్ని విశ్వహిందూ పరిషత్ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, మండల ప్రఖండ కార్యదర్శి ఓబులరెడ్డి, అధ్యక్షుడు వడిసెల రమణారెడ్డి, సహకార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, మాదిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, నాగరాజు,సాదుల శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్ష పాతి సీఎం జగన్



ఎల్‌ఈడీ స్క్రీన్‌పై అభివృద్ధిని తిలకిస్తున్న బలపాలపల్లె ప్రజలు

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేద ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేసి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల పక్షపాతిగా నిలిచారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, కొలుములపల్లె గ్రామ సర్పంచ్ చిన్న మద్దమ్మ, ఎంపీటీసీ మరియమ్మ అన్నారు. ఆదివారం రాత్రి మండల పరిధిలోని కొలుములపల్లె మజార గ్రామమైన బలపాలపల్లెలో డోన్ నియోజకవర్గంలో విద్య, వైద్య, రహదారుల అభివృద్ధిని ఎల్‌ఈడీ స్క్రీన్‌పై గ్రామస్తులకు చూపించారు. పిల్లలతో సహా అభివృద్ధిని ఉత్సాహంగా తిలకించారు. 30 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో జరిగిందని నాయకులు ఎద్దులన్న, శంకర్‌రెడ్డి, జయరామిరెడ్డి తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- స్త్రీలను అన్నిరంగాల్లో ప్రోత్సహిస్తున్న సీఎం వైఎస్ జగన్
- వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



బనగానపల్లె : ఆసరా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



అవుకు: ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ,జెడ్పీ చైర్మన్

బనగానపల్లె/ అవుకు: మహిళల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. సీఎం జగనన్న మహిళలను అన్నిరంగాల్లో ప్రోత్సహిస్తూ వారి అభివృద్ధికి అండగా నిలుస్తున్నారన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత సంబరాలు నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి పొదుపు మహిళలకు అందజేశారు. మండల కేంద్రం అవుకులోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోనూ వైఎస్ఆర్ ఆసరా సంబరాలు నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి, అవుకు సొసైటీ వైస్ పర్సన్ చల్లా విజయ బాస్కర్ రెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్ర రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డితో కలసి ఎమ్మెల్యే ఆసరా చెక్కును మహిళలకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మహిళలను ఉద్దేశించి ఎమ్మెల్యే కాటసాని ప్రసంగించారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి రాగనే 2019 ఏప్రిల్ 11 నాటికి పొదుపు గ్రూపులకు ఉన్న మొత్తం రుణాలను నాలుగు విడతలుగా చెల్లించారని గుర్తు చేశారు. బనగానపల్లె నియోజకవర్గంలో నాలుగు విడతలుగా వైఎస్సార్ ఆసరా మొత్తం 113.34 కోట్లు అమలుకాగా బనగానపల్లె మండలం రూ. 43.23 కోట్లు అమలు జరిగిందన్నారు. అవుకు మండలంలో 575 పొదుపు గ్రుపులు ఉండగా 6403 మంది మహిళ సభ్యులకు నాల్గవ విడత ఆసరా సొమ్ము రూ.3.39 కోట్లు మహిళల ఖాతాల్లో జమ అయ్యిందన్నారు. సీఎం వైఎస్ జగన్ సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. బనగానపల్లెలో రూ.22 కోట్లతో ఏరియా వైద్యశాల నిర్మాణం, కోవెలకుంట్ల, అవుకు పట్టణాల్లోను ఆసుపత్రుల నిర్మాణం చేశామన్నారు. బనగానపల్లె కోవెలకుంట్లలో పోర్‌లైన్స్,సెంట్రల్ లైటింగ్ సిస్టం తదితర అభివృద్ధి పనులను వివరించారు. బనగానపల్లెలో జరిగిన కార్యక్రమంలో యువనేత, ఎమ్మెల్యే తనయుడు కాటసాని ఓబులరెడ్డి మాట్లాడుతూ మహిళలను మభ్యపెట్టే టీడీపీకి రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. పురాణాలు, ఇతిహాసాల్లో స్త్రీల ప్రాముఖ్యతపై కాటసాని ఓబులరెడ్డి సతీమణి మేధాశ్రీరెడ్డి చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. బనగానపల్లె కార్యక్రమంలో వెలుగు ఏపీఎం తిరుపాల్‌రెడ్డి, ఈఓ ఖలీల్, ఎంపీపీ మానసవీణ, జెడ్పీటీసీ లక్ష్మీ సుబ్బమ్మ, మార్కెట్ యార్డు చైర్మన్ దీవెనమ్మ, ముస్లిం షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్, మండల కో ఆప్షన్ సభ్యులు అనిల్, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, మండల మహిలా సమాఖ్య అధ్యక్షురాలు హుస్సేన్‌బీ, కార్యదర్శి నాగలక్ష్మీ,బుక్‌కీపర్లు డ్వాక్రా సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బీసీకి... గుణపాఠం తప్పదు!

ప్రజలకు జరిగే మేలును అడుగడుగునా అడ్డుకుంటున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డికి మరోమారు గుణపాఠం తప్పదని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హెచ్చరించారు. బనగానపల్లె పట్టణంలోని 3,200 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు తాను సిద్ధం చేయగా కోర్టుకెళ్లి నిలుపుదల చేయించిన పాపం ఊరికే పోదని, మహిళల ఆగ్రహం చవిచూస్తారన్నారు. గతంలో ఎప్పుడూ జరగని అభివృద్ధి తాను చేసినా... ఏ అభివృద్ధి జరగలేదంటూ అసత్యారోపణలు చేయడం బీసీకే చెల్లిందని ఎద్దేవా చేశారు. అధికారం కోసం చంద్రబాబు ఆరాటపడుతున్నాడని, కుట్రరాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రజాబలం ఉన్న సీఎం జగన్‌ను ఢీకొనలేక చంద్రబాబు పొత్తులు, జిత్తులు అంటున్నారన్నారు. ఎంతమందితో కలిసి వచ్చినా వైఎస్సార్‌సీపీని బాబు ఏమి చేయలేరని, రాష్ట్ర ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేస్తారని చెప్పారు. అవుకులో జరిగిన కార్యక్రమంలో ఏపీఎం విజయ గోపాల్ రెడ్డి, ఏఓ వెంకటేశ్వర్లు, సర్పంచ్ మంద గుర్రమ్మ, ఎన్ఆర్‌జీఎస్‌స్టేట్ కౌన్సిల్ మెంబర్ ముక్కమల్ల పుల్లారెడ్డి, నంద్యాల జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి శేగు వెంకటేశ్వర్లు, సచివాలయ కన్వీనర్ తల్లం సుబ్రమణ్యం, కాంట్రాక్టర్ మద్దయ్య, మేకల వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్కా చెల్లెమ్మలు ప్రభుత్వానికి అండ

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



మహిళలకు మెగా చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: దుష్టశక్తులు ఎంత మంది ఏకమైనా కష్టకాలంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అక్కా చెల్లెమ్మలు అండగా నిలబడ్డారని, రెండు నెలల్లో జరగబోయే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం కొలిమిగుండ్లలోని షిర్డీసాయి ఫంక్షన్ హాల్‌లో నాల్గవ విడత ఆసరా వారోత్సవాల్లో భాగంగా 915 పొదుపు సంఘాల మహిళలకు రూ.4.95 కోట్ల మెగా చెక్‌ను అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతు వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది,పొదుపు మహిళల సహకారంతో రాష్ట్రంలోనే బనగానపల్లె నియోజకవర్గానికి ఆసరా కింద అత్యధికంగా రూ.113కోట్లు రావడానికి సాధ్యమైందన్నారు. దేశంలో ఏప్రభుత్వం ఖర్చు పెట్టని విధంగా అక్కా చెల్లెమ్మలకు ఖర్చు పెడుతున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. మహిళా సాధికారిత కోసం ఖర్చు పెడుతుంటే టీడీపీ నాయకులు ఓర్వలేక విమర్శలు చేయడం మంచిది కాదన్నారు. టీడీపీ హాయాంలో పొదుపు మహిళలకు రూ.16వేల కోట్లు రుణమాఫీ చేస్తానని హామి ఇచ్చి చివరకు ఎన్నికలు రెండు నెలల ముందుగా పసుపు–కుంకుమ పేరుతో రూ.10 వేలు ఇవ్వడంతో చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. ఐదేళ్ల పాటు ఏనాడు ప్రజల గురించి ఆలోచించని టీడీపీ నాయకులు ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజలపై ప్రేమ పుట్టుకొచ్చిందని, వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని మాఫీ చేసేందుకు ప్రతి మహిళా ఆదిపరాశక్తిగా మారాలన్నారు. మరో సారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకునేందుకు అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయికృష్ణ, ఏపీఎం తిరుపాల్‌రెడ్డి, ఏరియా కో–ఆర్డినేటర్ గురుస్వామి, మండల గ్రామైక్య సంఘం మండల అధ్యక్ష,కార్యదర్శులు మునీశ్వరి, ప్రభావతి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, సీనియర్ నాయకుడు సత్తిగారి రామిరెడ్డి, వైస్ ఎంపీపీలు కృష్ణారెడ్డి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లోనే తొమ్మిది గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

సంజామల: మండల పరిధిలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయనికి పగటిపూట తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, బొందలదిన్నె, కానాల, గిద్దలూరు, అక్కంపల్లె, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె ఫీడర్లలకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

తుమ్మల పెంటలో బోరు ఏర్పాటు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తుమ్మలపెంట శివాలయం సమీపంలో ఆదివారం బోరు ఏర్పాటు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా బోరు ఏర్పాటు చేయించాలని సర్పంచ్ బెస్త మల్లేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకుడు తోట మల్లేశ్వరరెడ్డి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే బోర్‌వెల్ వాహనాన్ని గ్రామానికి పంపించారు. రెండున్నర ఇంచుల మేర నీళ్లు పడ్డాయి. మంచినీటి సమస్య లేకుండా చేసేందుకు అడిగిన వెంటనే బోరు వేయించిన ఎమ్మెల్యే కాటసానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

హెల్త్ కేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

డోన్ టౌన్ : కీట్స్ ట్రస్టు నందిగామ(విజయవాడ) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు హెల్త్ కేర్ కౌన్సిలర్, కో ఆర్డినేటర్ కోర్సుల్లో ఉచిత వసతి, భోజన సౌకర్యాలతో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు సంస్థ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ చదివి 19 నుండి 30 ఏళ్ల అభ్యర్థులు అర్హులన్నారు. నందిగామలోని తమ సంస్థలో 60 రోజుల పాటు హెల్త్ కేర్‌తో పాటు కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూలు స్కిల్స్‌లలో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. అదేవిధంగా హాస్పిటల్స్, హెల్త్ కేర్ సంస్థలలో ఉద్యోగవకాశాలు కల్పిస్తామని, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



రోడ్డు పక్కనే మళ్లీ వదిలేసిన రాళ్ల గుట్టలు

మారని తీరు!

కొలిమిగుండ్ల: వందలాది వాహనాలు నిత్యం ప్రయాణించే ప్రధాన రహదారి చెంతనే రాళ్ల కుప్పలు వదిలిపెడుతున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం, రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా వారి తీరులో మార్పు రావడం లేదు. కనకాద్రిపల్లె సమీపంలో ప్రధాన రహదారి ఎత్తు పల్లాలుగా ఉంది. ఈరోడ్డుకు ఇరువైపులా పాలీష్ ఫ్యాక్టరీల వేస్టేజీ రాళ్లను రోడ్డు పక్కలో వేస్తున్నారు. అధికారులు రాళ్ల కుప్పలను పలుమార్లు తొలగించేయిస్తున్నా...యథావిధిగా వేస్టేజీని వేస్తూనే ఉన్నారు. కొద్ది రోజుల క్రితం ఎగువ ప్రాంతంలో లారీ ఎక్కిపోయే సమయంలో సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. రోడ్డుకు ఇరువైపులా రాళ్ల గుట్టలు ఉండిపోయాయి. ప్రత్యామ్నాయ మార్గం లేక వందలాది వాహన చోదకులు సుమారు 12 గంటలకు పైగానే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానికులు, పోలీసులు చర్యలు తీసుకొని రోడ్డుకు ఒక వైపు ఉన్న రాళ్ల గుట్టలను పొక్లయినర్‌తో కొంత వరకు పక్కకు తొలగించి వాహనాలు రాకపోకలు సాగించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం అదే ప్రదేశంలో ఫ్యాక్టరీ యజమానులు వేస్టేజీ రాళ్లను ట్రాక్టర్లలో తీసుకొచ్చి గుట్టలుగా పడేశారు. అక్కడ రాళ్లను పడేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఫ్యాక్టరీ యాజమానికి తెలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీల వేస్టేజీ రోడ్డుపై వేయకుండా అధికారులు కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నారు వాహనచోదకులు, ప్రజలు.



గ్రామంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న భవనాలు

ప్రభుత్వ భవనాలు ముస్తాబు

బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాలకు పట్టణ శోభ సంతరించుకుంది. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, బల్క్ మిల్క్ సెంటర్ భవనాలతో పల్లెలు కళకళలాడుతున్నాయి. మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామంలో రూ. 35 లక్షలతో గ్రామ సచివాలయం, 21.80 లక్షలు రైతు భరోసా కేంద్రం, రూ. 17.50 లక్షలతో చేపట్టిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రారంభోత్సవానికి ముస్తాబయ్యాయి. గ్రామంలో ఒకేచోట సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించడంతో గ్రామస్తులకు సౌకర్యంగా మారనున్నాయి.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు

బనగానపల్లె రూరల్ : రాష్ట్ర స్థాయి ఆడుదాం ఆంధ్రా వాలీబాల్ బాలుర క్రీడా పోటీలకు ఎంపికైన బనగానపల్లె సచివాలయం–2కు చెందిన క్రీడాకారులను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అభినందించారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో కలిసిన క్రీడాకారులను అభినందించిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లోను ప్రతిభ చూపించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య,ఈఓ ఖలీల్,మండల కో ఆప్షన్ సభ్యులు అనిల్‌హుస్సేన్, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, క్రీడాకారులు ఎం నరేష్, ఇబ్రహీం, అబ్దుల్లా వై బేన్ని, అబ్దుల్‌రహీం, ఆసీఫ్,కె మహేష్, ఎస్ఎండీ షరీఫ్‌బాషా, ఎం నాగేంద్ర, కె మోహన్, ఎస్ చాంద్‌బాషా, రియజ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

డోన్ టౌన్ : స్థానిక పట్టణ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ నగేష్ ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాతనేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. మట్కా, జూదం, నాటు సారా, అక్రమ మద్యం, గంజాయి తదితర క్రయ విక్రయాలు జరుగుతుంటే సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజల జీవనానికి భంగం కలిగిస్తే జైలుకు పంపుతామని హెచ్చరించారు.

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా

డోన్ టౌన్ : కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధ్యం అవుతుందని ఆ పార్టీ డీసీసీ అధ్యక్షుడు జంగిటి లక్ష్మీనరసింహయాదవ్ అన్నారు. ఆదివారం డోన్‌కు వచ్చిన ఆయన స్థానిక కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో నియోజకవర్గ ఇంచార్జ్ మద్దిలేటి, నాయకులు సుబ్బయాదవ్, శ్రావణ్‌కుమార్, శివరాముడు, శేఖర్, రాజశేఖర్, రామాంజనేయులు, మహేంద్రనాయుడు, నాగరాజు, మల్లికార్జున, లక్ష్మన్న, మధు తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల మండలంలో టీడీపీకి షాక్



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మురళీకృష్ణారెడ్డి,అమర్నాథ్‌రెడ్డి, నాయకులు

బనగానపల్లె రూరల్ : కొలిమిగుండ్ల మండలంలోని హనుమంతగుండం గ్రామలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. ఆ గ్రామానికి చెందిన టీడీపీ ప్రధాన నాయకుడు సత్తిగారి మురళీకృష్ణారెడ్డితో పాటు అమర్నాథ్‌రెడ్డి, పొట్టిపాడు గంగరాజు, జూటూరుహుస్సేన్‌పీరా, పుల్లయ్య ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారికి కాటసాని వైఎస్సార్‌సీపీ కండువవేసి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ నుంచి సత్తిగారి మురళీకృష్ణారెడ్డి,అమర్నాథ్‌రెడ్డి తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. మురళీకృష్ణారెడ్డి కుటుంబంతో కాటసాని కుటుంబానికి బంధుత్వం ఉన్నప్పటికీ కొన్ని కారణాల మూలంగా ఆయన దూరమయ్యాయరని, ఇప్పుడు కలువడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హనుమంతగుండం సహకార సొసైటీ మాజీ చైర్మన్ సత్తిగారి రామిరెడ్డి, కొలిమిగుండ్ల మండల ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాగిశెట్టిపల్లె గ్రామ సర్పంచ్ ఈశ్వరయ్య, హనుమంతగుండం బాలిరెడ్డి, కలవటాల తిమ్మారెడ్డి, కోటపాడు రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సువార్త స్వస్థత సభలు

- ముస్తాబైన సభా ప్రాంగణం



సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న శ్రీరాములు



సుందరంగా తీర్చిదిద్దన సభా వేదిక

డోన్ టౌన్ : పట్టణంలో సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు సువార్త స్వస్థత మహా సభలు జరుగనున్నాయి. ఈ మేరకు వెంకటనాయునిపల్లె రోడ్డు ఓనైరో స్కూల్ వెనుక మైదానంలో సభా వేదిక ముస్తాబైంది. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డోన్ డివిజన్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, నిర్వాహకులు పాస్టర్ నిత్యానందనం, కమిటీ సభ్యులు సువార్త స్వస్థత మహా సభల వివరాలను తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణా రాష్ట్రం బెల్లంపల్లి కల్వరి మినిస్ట్రీస్ ఉజ్జీవం దైవజనులు పాస్టర్ ప్రవీణ్, సిస్టర్ షారోన్ మహా సభలకు హాజరవుతారన్నారు. ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు సాయంత్రం 6గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, యేసు విశ్వాసకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు

కల్వరి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరుగనున్న ఉజ్జీవం సువార్త స్వస్థత మహా సభల ఏర్పాట్లను రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు పరిశీలించారు. ఈ సందర్భంగా పాస్టర్లతో కలిసి మహా సభల విజయవంతం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహా సభలకు చివరి రోజు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి హాజరవుతారని శ్రీరాములు చెప్పారు. కార్యక్రమంలో పాస్టర్లు నిత్యానందం, మోహన్‌రావ్, ఏడీ రాజు, శ్యాంసన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు మెరుగు‘బడి’

- మారిపోయిన వంద పాఠశాలల రూపురేఖలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు





నాడు- నేడు మనబడి కార్యక్రమంతో నేడు అన్ని హంగులతో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, తాగునీటి కోసం ఏర్పాటు చేసిన కుళాయిలు



పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి

కోవెలకుంట్ల: విద్యారంగానికి పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాడు– నేడు మనబడి కార్యక్రమం ద్వారా సర్కారు బడుల రూపురేఖలు మార్చివేసింది. నూతన తరగతి గదుల నిర్మాణం, పాత తరగతి గదులకు మరమ్మతులు, బాత్‌రూంలు, మరుగుదొడ్లు, తాగునీరు, తదితర మౌలిక సదుపాయాల కల్పనకు లక్షలాది రూపాయాలు వెచ్చించింది ప్రభుత్వం. బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో వంద పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. ప్రత్యేకించి కోవెలకుంట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో రూ. 76.60 లక్షలతో పాఠశాలను అన్ని హంగులు కల్పించారు. అదనపు తరగతి గదులతోపాటు మరమ్మతులు, మౌలిక సదుపాయాలు కల్పించి బనగానపల్లె నియోజకవర్గంలోనే మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దడంతో విద్యార్థినులతోపాటు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప తెలిపారు. గ్రామానికి చెందిన గుడిసె రంగమ్మ నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.